ప్రజాశక్తి
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023
5
అల్లూరి సీతారామరాజు

రక్తదానంతో ప్రాణదానం : కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కలక్టరేట్ సమావేశ మందిరంలో రెడ్ క్రాస్ ఏర్పాటు చేసిన రక్త దాన శిభిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రక్త దానం చేయడంతో ఎటువంటి నష్టమూ లేదని, ఆరోగ్య వంతులందరూ రక్తదానం చేయవచ్చని సూచించారు. జిల్లాలో అవసరమైనంత రక్త నిల్వలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిగ్రీ కళాశాలల వద్ద ప్రత్యేక శిభిరాలు ఏర్పాటు చేసి రక్త సేకరణ చేయాలన్నారు. రక్త దాన శిభిరంలో పది యూనిట్ల రక్తం సేకరించినట్లు రెడ్ క్రాస్ కార్యదర్శి ఈశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసి శివ శ్రీనివాసు, డిఆర్ఓ పి.అంబేద్కర్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, సభ్యులు, పేథాలజిస్ట్ రూప కళ పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

సందడిగా.. పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ నామినేషన్

- తరలివచ్చిన ప్రజాసంఘాల నేతలు, పట్టభద్రులు
- పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు.. ఉత్తరాంధ్ర మలుపు : వక్తల ఉద్ఘాటన
- ప్రజల గొంతుకనవుతా : రమాప్రభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో: ఒకటే ఉత్సాహం.. ఉత్తేజం. ఉత్తరాంధ్ర ప్రజల గొంతులు ఒక్కసారిగా.. ఒక్కటై నినదించాయి. 'పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు.. ఉత్తరాంధ్ర మలుపు' అంటూ హోరెత్తాయి. మహిళల కోలాటాలు, యువత తీన్‌మార్ డోలు చప్పుళ్లు.. కేరింతలు, నృత్యాలతో విశాఖ నగరం గురువారం కొత్త ఎన్నికల ఉత్సాహాన్ని సంతరించుకుంది. ఉత్తరాంధ్ర ప్రాంత వెనుకబాటుతనంపై ప్రశ్నించేందుకు ప్రజల గొంతుకై ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీ చేస్తోన్న విద్యాధికురాలు, సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ నామినేషన్‌కు గురువారం ఉదయం విశాఖకు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజాసంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పట్టభద్రులు, మహిళలు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో వచ్చి కదంతొక్కారు. భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద సభలో వందల మంది పాల్గొన్నారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కావాలని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని, రైల్వే జోన్ సాధన అవసరమని.. ఇలా సమస్య ఎక్కడ ఉంటే అక్కడ పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు అండగా ఉండే పిడిఎఫ్ అభ్యర్థి గెలుపుకోసం పెద్దపెట్టున నినదిస్తూ విశాఖ రోడ్లపై వందలాది మంది ముందుకు సాగారు. డాబాగార్డెన్ సరస్వతీ పార్కు నుంచి జగదాంబ జంక్షన్ మీదుగా ఈ భారీ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ సాగింది. 250కు పైగా ప్రజా సంఘాలు బలపరుస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభకు వివిధ తరగతుల నుంచీ మద్దతు లభించింది. తొలుత అంబేద్కర్, తర్వాత తెన్నేటి, మదర్ థెరిసా విగ్రహాలకు పూలమాల వేసిన తర్వాత ర్యాలీ ఆరంభమైంది.

గడచిన ఆరేళ్లుగా బిజెపి ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ ఒక్క ప్రజా సమస్యనూ పరిష్కరించలేదని, పైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిస్సిగ్గుగా సమర్థించుకున్నాడని ర్యాలీ సందర్భంగా సాధారణ జనం మండిపడ్డారు.

సభలో మాట్లాడుతున్న లక్ష్మణరావు, చిత్రంలో ఐవి, రమాప్రభ, అజశర్మ

కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు విభజన హామీ చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ ఆంధ్రప్రదేశ్‌కు, ఉత్తరాంధ్రకు అమలు చేయకుండా తీవ్ర ద్రోహం చేస్తోందంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరంతర పోరాటశీలి పిడిఎఫ్ : వక్తలు

గురువారం నామినేషన్ దాఖలు చేసే ముందు కలెక్టరేట్ వద్ద 250 ప్రజా సంఘాలు సహా పిడిఎఫ్ సంయుక్తంగా సభ నిర్వహించాయి. ఈ సభకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షత వహించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం మండలి బయటా, లోపలా పోరాడుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పిడిఎఫ్ అభ్యర్థిగా నిలబెట్టిన డాక్టర్ కె.రమాప్రభకు అవగాహన ఉందన్నారు. మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కోట్లకు పడగలెత్తే వారు ఓట్లు కోసం వస్తున్నారని, వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాడే వారిపై ఈ సర్కారు కక్ష కట్టిందని, ఉపాధ్యాయులు, ఉద్యోగులపై పెటీ కేసులు పెట్టడం సిగ్గుచేటని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ గడచిన ఆరేళ్లలో ఉత్తరాంధ్ర నుంచి పిడిఎఫ్ అభ్యర్థి మండలిలో లేనందున తీవ్ర నష్టం జరిగిందని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు బిజెపి ఒడిగట్టిందని, రైల్వే డివిజన్ పోయిందని, జోన్ రాకుండా కేంద్రం దొంగ నాటకాలతో కాలం నెట్టుకొస్తోందని తెలిపారు. పిడిఎఫ్ లేకపోతే విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఎంత అన్యాయం జరిగిందో చదువుకున్న వారంతా గుర్తించారన్నారు. తాజాగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్సీగా పోటీచేస్తూ 'ఓట్లేయండి.. సేవ చేస్తాం' అంటూ పట్టభద్రుల ఓట్లను అడుక్కుంటున్నారని, గడచిన 30 ఏళ్లుగా ఉత్తరాంధ్రలో వివిధ తరగతుల ప్రజలకు రమాప్రభ సేవలందిస్తున్నారని శర్మ గుర్తుచేశారు.

ఉత్తరాంధ్రకు రూ.24 వేల కోట్లుకుగాను రూ.450 కోట్లే వచ్చాయి : రమాప్రభ

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ప్రశ్నించే గొంతులు మూగబోతున్నాయని, ఏపి విభజన హామీ చట్టం ప్రకారం ఈ ప్రాంతానికి రూ.24 వేల కోట్లు నిధులు అభివృద్ధి కోసం రావాల్సి ఉండగా కేవలం రూ.450 కోట్లే వచ్చాయని పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని మోసం చేసిందన్నారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి మూడున్నరేళ్లయినా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలకు, రైల్వే జోన్ సాధనకు సాగుతున్న పోరాటాలకు అండగా ఉంటానన్నారు.

విశాఖ నగరంలో వందలాది మందితో సాగుతున్న రమాప్రభ నామినేషన్ ర్యాలీ

పెద్ద సంఖ్యలో ఉద్యమ, ప్రజా సంఘాల నేతలు హాజరు

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన సాగిన సభలోనూ, రమాప్రభ నామినేషన్ ర్యాలీలోనూ ఉద్యమ నేతలు సిహెచ్.నర్సింగరావు, కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి వేణు, గోవిందరావు, అప్పలనర్స, సురేంద్ర, ఎం.పైడిరాజు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, రాము, పలు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల తొలిఘట్టం ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మార్చి 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోరులో నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. ఈ ప్రాంతానికి చెందిన విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన సుమారు 250 ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ నామినేషన్ ప్రక్రియ ప్రారంభం రోజునే రెండు సెట్ల నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు అందజేశారు. ఆమె వెంట పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఉన్నారు. తొలి రోజు ఈ ఒక్క నామినేషనే దాఖలైంది.

మందుల గదిని పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు

అన్ని రకాల మందులూ అందుబాటులో ఉండాలి

- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని మారుమూల ప్రాంతమైన జీడిగుప్ప ప్రాథమిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ఎంపిపి కారం లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎంపిపి లక్ష్మి సిపిఎం నాయకులతో కలి జీడిగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రోజారమణితో మాట్లాడి సమస్యలను, రోగాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి మలేరియా కేసులు ఎక్కువ వస్తున్నాయని, మందులు లేక రోగులను రిఫర్ చేయాల్సి వస్తుందని వైద్యాధికారి తెలిపారు. డెంగీ కిట్లు కూడా అందుబాటులో లేవన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాలు, జలుబులు లాంటి కేసులు ఎక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యాధికారి, సిబ్బంది ఉండగానే సరిపోదని, అన్ని మందులు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా అన్ని రకాల మందులు అందుబాటు ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఆసుపత్రి సిబ్బంది ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

అక్రమంగా సారా తరలిస్తున్న యువకుడు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

సారాను అక్రమంగా తరలిస్తున్న యువకుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... పోలీసు బలగాలు చింతపల్లి క్యాంపు సమీపంలో గురువారం ఉదయం తనిఖీలు నిర్వహిస్తుండగా జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపునకు చెందిన వంతల గణేష్ సారా అక్రమంగా తరలిస్తూ పోలీసులు పట్టుబడ్డాడు. దీంతో గణేష్ వద్ద నుంచి సారాను స్వాధీనం చేసుకుని, ఆయన్ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గణేష్‌ని విచారించిన అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన యువత చెడు మార్గాలను వీడాలన్నారు.

బియ్యం , బట్టలు పంపిణీ చేస్తున్న అనిల్‌కుమార్ తదితరులు

బియ్యం, బట్టలు అందజేత

ప్రజాశక్తి-కూనవరం

ఫెయిత్ వే ఇండియా ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన గురువారం మండలంలోని కూటూరు గ్రామంలో 100 మంది గిరిజనులకు ప్రతి కుటుంబానికి ఒక బియ్యం బస్తా, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ అనిల్ కుమార్ అద్దేపల్లి (బాపట్ల) మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి మహిళలకు, పిల్లలకు బట్టలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానికులు అనిల్ కుమార్ చేస్తున్న సేవల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ మోజెస్, 10 మంది సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం మన్యం కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు ఆర్ఎస్ స్వేచ్ఛ సొసైటీ చైర్‌పర్సన్ కంటా స్వాతి చేతుల మీదుగా గురువారం వ్యవసాయ పరికరాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. రైతులు వ్యవసాయ పరికరాలు కోసం చాలా మంది ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో మన్యం సొసైటీ ద్వారా ఇచ్చే పథకాలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్, మగేశ్వరరావు, శ్రీను, అనూష, లోవ, అరుణ లింగరాజు, రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న స్వాతి తదితరులు

మాట్లాడుతున్న పిఒ

వెలుగు సిబ్బంది పనితీరు మెరుగు పడాలి

- ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ ఆదేశించారు. వెలుగు అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని స్పష్టం చేసారు. స్వయం సహాయ సంఘాల ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. స్థానిక కాఫీ హౌస్ సమావేశ మందిరంలో 11 మండలాల వెలుగు క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. కొత్త సంఘాల ఏర్పాటు, స్వయం సహాయ సంఘాల గ్రేడ్లు, బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజీ, రైతు ఉత్పత్తి దారుల సంఘాల పనితీరు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్పత్తులపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటిడిఎ పరిధిలో కొత్తగా 1100 స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశిస్తే 467 ఏర్పాటు చేసారన్నారు. మిగిలినవి 633 సంఘాలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.ఎన్ని సంఘాలకు బ్యాంకు లింకేజీ ఇచ్చారని వెలుగు సిబ్బందిని ప్రశ్నించారు. జి.మాడుగుల, జికె వీధి మండలాల్లో నిర్మిస్తున్న ఎకోపల్ఫింగ్ యూనిట్‌లో మహిళా సంఘాలు భాగ స్వామ్యం కావాలన్నారు. ఈ సమవేశంలో వెలుగు ఎపిడి మురళి, ఎల్‌డిఎం రవితేజ, అధికారులు పాల్గొన్నారు.

నగదును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పాడేరు: ఆకస్మికంగా మృతి చెందిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి సహోద్యోగులు, పలువురు దాతలు ఆర్థిక సహాయాన్ని అందించి ఆసరాగా నిలిచారు. జిల్లాలోని పాడేరు డివిజన్ పెదబయలు మండలం కిముడుపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు పారామెడికల్ హెల్త్ అసిస్టెంట్ కోడా గోపాల్‌రావు అకాల మరణం పొందిన సంగతి విధితమే. దీనిపై స్పందించిన కాంట్రాక్ట్ పారామెడికల్ వైద్య ఆరోగ్య ఉద్యోగుల యూనియన్ తరపున గోపాలరావు కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించేందుకు పలువురు సహ ఉద్యోగులు, దాతలు ముందుకు వచ్చారు. యూనియన్ నాయకులు శెట్టి నాగరాజు, లక్ష్మణ్‌రావు వాట్సాప్ ద్వారా తోటి మిత్రులకు సమాచారం ఇచ్చి రూ.76,504 ఆర్థిక సాయాన్ని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు అప్పలనర్స ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా గోపాలరావు కుటుంబానికి అందజేశారు. గిరిజన సంఘం నాయకులు అప్పల నర్స, పాలికి లక్కు జిల్లా కలెక్టరుకు గోపాలరావు కుటుంబం దీన పరిస్థితిని వివరించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని గోపాలరావు సతీమణికి అందించారు. కొద్ది రోజుల్లో తాత్కాలిక ఉద్యోగం ఇచ్చేందుకు చూస్తామని లేదా రెండు లక్షల నుండి 5 లక్షల వరకు బ్యాంకు ద్వారా రుణం ఇప్పిస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

విద్యుత్ బిల్లులు కట్టించుకోరూ...

- నాలుగు నెలలుగా పెండింగ్
- అపరాధ రుసుము పడుతుందని వినియోగదారుల ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు

విద్యుత్ బిల్లులు కట్టించుకోండి మహాప్రభ అంటూ జికె.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. సీలేరు పంచాయతీ పరిధిలో క్యాటగిరీ 1, కేటగిరి 2 మీటర్లు సుమారు 1000 ఉన్నాయి. నవంబర్ నుంచి ఇప్పటి వరకు సుమారు నాలుగు నెలలు బిల్లు కట్టించుకోలేదు. దీంతో పెనాల్టీ మీద పెనాల్టీ పడుతుండడంతో విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022 అక్టోబర్ వరకు బిల్లు కలెక్టరు వచ్చి విద్యుత్ వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేశారు. నవంబర్ నుంచి నాలుగు నెలలుగా బిల్లు కలెక్టర్ విద్యుత్ బిల్లు వసూలు చేయలేదు. దీని వల్ల విద్యుత్ వినియోగదారులు అదనపు డబ్బులు చెల్లించడంతో పాటు ట్రాన్స్‌కోకు లక్షలాది రూపాయలు ఆదాయం గండి పడనుంది.

ఫోన్ పే ద్వారా మీ సేవ ద్వారా విద్యుత్ బిలులు చెల్లించుకోవచ్చని ట్రాన్స్‌కో సిబ్బంది సూచిస్తున్నారు. అయితే ఆ విధంగా కొంత మంది వినియోదారులు మాత్రమే విద్యుత్ బిల్లు చెల్లించుకోగలుగుతున్నారు. గిరిజనులు పరిజ్ఞానం లేక విద్యుత్ బిల్లులు చెల్లించుకోలేక నాన అవస్థలు పడుతున్నారు. ప్రతినెల క్యాటగిరీ 2 మీటర్లకు సంబంధించిన విద్యుత్తు బిల్లులు బకాయాలను సీలేరు ట్రాన్స్‌కో లైన్‌మెన్ రాంబాబుకు డీ లిస్టు పంపించి సంబంధిత వినియోగదారుల నుండి ఫోన్ పే కొంత మంది విద్యుత్ బిల్లులు కట్టించుకోగలుగుతున్నారు. కూలి చేసుకున్న గిరిజనులు విద్యుత్ బిల్ కలెక్టర్ బిల్లు కట్టించుకోవడానికి రారపోవడంతో వారు కట్టలేని స్థితి నెలకొంది. తక్షణమే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ బిల్లులు కట్టించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సీలేరు పంచాయతీ పరిధి విద్యుత్ వినియోగదారులు డిమాండ్ చేశారు.

విద్యుత్ బిల్లు కట్టించుకోవాలని వేడుకుంటున్న వినియోగదారుడు కె.సత్తిబాబు

దీనిపై ట్రాన్స్‌కో ఏడిఈ కె.సూర్యప్రకాష్‌ని ప్రజాశక్తి వివరణ కోరగా ఇటీవల స్టాఫ్ మీటింగ్‌లో ఈ విషయం ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లగా, సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని తెలిపినట్లు ఆయన వెల్లడించారు.

గంజాయి, నాటుసారా రవాణా చేస్తే చర్యలు

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వాహనదారులు గంజాయి, నాటు సారా వంటివి అక్రమ రవాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జడ్డంగి ఎస్సై షరీఫ్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం జడ్డంగి గ్రామ శివారులో ఏలేశ్వరం -రాజవొమ్మంగి ప్రధాన రహదారిలో ఎస్సై షరీఫ్ వాహన తనిఖీలు చేపట్టారు. రహదారి మీదుగా వచ్చి పోయే ప్రతి వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. వాహనాల్లో లగేజీలను పరిశీలించారు. వాహన రికార్డులు సక్రమంగా లేని పలు వాహనదారుల నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వరాదని, మైనర్లు ప్రమాదాలు చేసినట్లయితే యజమానులపై చర్యలు తప్పని హెచ్చరించారు. ఓవర్ లోడు, ఓవర్ స్పీడు ప్రమాదకరమని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహనాలకు సంబంధించిన రికార్డులు లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బెటాలియన్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని చట్టి జాతీయ రహదారి వద్ద చింతూరు ఎస్సై యాదగిరి ఆధ్వర్యంలో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్లు, బైక్ రైడర్స్, లారీ డ్రైవర్లను నిలిపి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. కొంత మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మద్యపానం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు. తరచూ వాహనాలకు ప్రమాదానికి గురై పరిస్థితి ముఖ్యంగా మద్యం సేవించడం వలనే జరుగుతుందని చెప్పారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే శిక్ష పడుతుందని తెలిపారు.

వాహనదారులకు మద్యం పరీక్ష చేస్తున్న ఎస్ఐ యాదగిరి

కాఫీ ప్రోత్సాహక బకాయిలు చెల్లించాలి

ఐటిడిఏ వద్ద ర్యాలీ, ధర్నా

పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన కాఫీ రైతులు

ప్రజాశక్తి-పాడేరు : ఏజెన్సీలో కాఫీ రైతుల ప్రోత్సాహక బకాయిలను ఐటిడిఏ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతుల సంఘం, ఏపీ గిరిజన సంఘం సంయుక్తంగా పాడేరు ఐటిడిఏ వద్ద గురువారం ర్యాలీ, ధర్నా చేపట్టింది. కాఫీ రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు విలేకరులతో మాట్లాడుతూ, కాఫీ సాగు, అమ్మకాల్లోనూ కాఫీ రైతులు దగా పడుతున్నారని, దీంతో ఆందోళన బాట పట్టాల్సి వస్తోందని చెప్పారు. అధికారులు స్పందించి కాఫీ రైతులకు చెల్లించవలసిన ప్రోత్సాహక బకాయిలపై స్పష్టంగా తెలపాలని డిమాండ్ చేశారు. బకాయిల కోసం ఈనెల 17న శుక్రవారం చేపడుతున్న ధర్నాకు ఏజెన్సీ 11 మండలాల నుంచి కాఫీ రైతులు తరలి రావాలని కోరుతూ అన్ని మండలాల్లో నెల రోజులుగా సమావేశాలు, ప్రచారం చేశామన్నారు. 2018 నుంచి 2023 వరకు కాఫీ ప్రాజెక్ట్ ద్వారా గత ఐదేళ్లలో కొత్తగా కాఫీ తోటల పెంపకం చేపట్టిన సుమారు 44 వేల మంది గిరిజన రైతులకు కాఫీ సాగు చేపట్టినందుకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం చెల్లిస్తున్న బకాయిలు సుమారు రూ.60 కోట్లు పేరుకు పోయాయని, ఐటిడిఏ అధికారులు మాత్రం 39 కోట్లు బకాయిలు చెల్లించవలసి ఉన్నట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. పాడేరు మండలంలోని గుత్తులపుట్టు వారపు సంతలో కాఫీ రైతుల ధర్నాపై ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం పాడేరు మండల అధ్యక్షుడు సోమిలి చిట్టిబాబు, మండల నాయకులు కుర్సా నానాజీ, కుర్ర మోహన్ బాబు, మత్స్యరాజు, పలు గ్రామాల కాఫీ రైతులు పాల్గొన్నారు.

నేడు ఐటిడిఎ ముట్టడి

జయప్రదం చేయాలని లక్ష్మీపురం సర్పంచ్ విస్తృత ప్రచారం

గిరిజనులతో మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : కాఫీ ప్రోత్సాహక బకాయిల చెల్లింపు, ఇతర సమస్యలపై ఈ నెల 17న పాడేరు ఐటిడిఎ ముట్టడి ఆందోళనను జయప్రదం చేయాలని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ పిలుపునిచ్చారు. ముట్టడి విజయవంతానికి గిరిజన రైతుల సమీకరణలో భాగంగా వారితో మాట్లాడుతూ, ఐటిడిఎ పరిధిలోని 11 మండలాల్లో కాఫీ రైతులకు 2017 నుంచి 2022 వరకు దాదాపు రూ.నాలుగు కోట్లు కాఫీ ప్రోత్సాహక నిధులు చెల్లించాల్సి ఉందన్నారు. ఐటడిఎ పిఒ ఇష్టానుసారంగా రైతలకు చెల్లించాల్సిన కాఫీ ప్రోత్సాహక నిధులను ఇష్టానుసారంగా దారి మళ్లించి ఇతర పనులకు వినియోగం, దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కాఫీ రైతుల సమస్యల పరిష్కారం, ప్రోత్సాహక నిధులు చెల్లింపుల్లో నిర్లక్ష్యం వంటి ఐటిడిఎ పిఒ నిరంకుశవైఖరికి నిరనసగా శుక్రవారం చేపట్టే ఐటిడిఎ ముట్టడి ఆందోళనలో పెద్దఎత్తున కాఫీరైతులు, గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అర్లబు సత్యం, ధనుర్చాయ్, పుర్సోతి, కాఫీ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు

పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు

ప్రజాశక్తి-పాడేరు : పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో గురువారం మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శివపార్వతుల కల్యాణం నిర్వహించేందుకు భక్తులు ఉదయాన్నే పూజా సామగ్రితో సిద్ధమై ఆలయానికి తరలి వచ్చారు. శివపార్వతులను నూతన వస్త్రాలతో అలంకరించి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలంనాయుడు దంపతులు స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నెలకొల్పిన సుబ్రహ్మణ్యం స్వామి, అయ్యప్ప స్వామి విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా బృందం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఉప్పల వెంకటరత్నం, కొట్టగుల్లి రమేష్ నాయుడు, కోనే శివ, పలాస బాలన్న మాస్టారు పాల్గొన్నారు.

కాగిత పూలతో సరికొత్త అందాలు

సీలేరు ప్రధాన రహదారిలో కాగితపూలు చెట్లు

ప్రజాశక్తి- సీలేరు : ప్రకృతి అందాలకు పెట్టింది పేరు ఉమ్మడి విశాఖ మన్యం. సెలయేరులు, జలపాతాలు, వంపులు తిరిగిన రోడ్లు, దట్టమైన అడవులు ఇలా ప్రతీదీ ప్రకృతి, పర్యావరణ ప్రేమికులతోపాటు మామూలు మనుషుల మనసులను దోచి, మైమరిపింపజేసే సుందర దృశ్యాలే. ఇలా అందాలకు నెలవైన మన్యంలో, రంగురంగుల కాగిత పూలు సోయగం సరికొత్త శోభను తెచ్చిపెడుతున్నాయి. సీలేరు ప్రధానరహదారి సమీపాన యుసిఐఎం చర్చి వద్ద గులాబీరంగు కాగిత పూల అపురూప అందాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, పర్యాటకులు ఒక్కసారైనా అటువైపు చూసి వెళ్లేంతగా తళుకులీనుతున్నాయి.

అసౌకర్యాలపై అసహనం

- దారాలమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు అవస్థలే
- తాగునీరు, మరుగుదొడ్లు, వసతి అన్నీ సమస్యలే
- పట్టించుకోని దేవాదాయశాఖ అధికారులు

శిథిలావస్థకు చేరిన పాత నీటి కుండీ

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి జిల్లా మన్యవాసుల ఆరాధ్య దైవంగా కొలుస్తున్న దారాలమ్మ ఆలయం వద్ద అసౌకర్యాలపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వద్ద భక్తులు బస చేయడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్ లో వెలసిన దారాలమ్మ ఆలయానికి ప్రతినిత్యం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు, మొక్కులు తీర్చుకుంటుంటారు. సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. భక్తులు స్నానాలాచరించడానికి సరైన సౌకర్యాలు లేకపోగా, కనీసం మరుగుదొడ్లు లేక మహిళలు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం, అధికారులకు పట్టడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఆలయానికి కిలోమీటర్ దూరంలో ఉన్న ఎత్తయిన కొండల నుంచి పైపులైన్ ద్వారా ఊటనీటిని ఒడిసిపట్టి, అనునిత్యం భక్తులకు ఉండేలా

భక్తుల వినియోగానికి నూతనంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక మంచినీటి కుండీ

పెద్ద కుండీలను ఏర్పాటు చేసినప్పటికీ అవి శిథిలావస్థకు చేరుకుంది. ఆలయకమిటీ తాత్కాలిక సభ్యులు స్పందించి పాత నీటి కుండీ సమీపంలోనే కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంకును ఏర్పాటు చేశారు. అయితే సిని నటుడుబాలకృష్ణ ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన ఒక్క వసతి భవనం తప్ప, ఇతర సౌకర్యాలు ఇక్కడ మచ్చుకైనా కానరావని భక్తులు ఆవేదన చెందుతున్నారు.

వేడుకలు ఆర్భాటమే.. సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం

ఏటా కొత్త అమావాస్య, ఉగాదికి ధారాలమ్మ ఆలయంలో భారీ ఎత్తున నిర్వహించే వేడుకలకు ఆంధ్రా ఒడిశా, ఛత్తీస్‌గఢ్,తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భారీ ఎత్తున సాంప్రదాయిత వేడుకలను కూడా నిర్వహిస్తారు. అయితే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మాత్రం ఇక్కడ కనీస సౌకర్యాల కల్పనలో దేవాదాయశాఖ వైఫల్యంపై భక్తులు, ప్రజలు మండిపడుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

ధారాలమ్మ దర్శనానికి నిత్యం వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయం వద్ద వాటర్ ట్యాంక్, వంట షెడ్డు, వసతి, స్నానపు గదులు, మరుగుదొడ్లు వంటి అదనపు సౌకర్యాలు కల్పించాలని భక్తులతోపాటు స్థానికులు కోరుతున్నారు ఈ ఏడాది దారాలమ్మ ఉత్సవం నాటికి కనీసం కొన్ని సౌకర్యాలైనా కల్పించాలని కోరుతున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాన్ని వినియోగించుకోండి

ఎడిఎంహెచ్ఒ డాక్టర్ లీలాప్రసాద్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను ప్రజలు అనారోగ్య పీడితులు, దీర్ఘకాలిక రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎడిఎంహెచ్ ఒ డాక్టర్ లీలాప్రసాద్ సూచించారు. గురువారం పాడేరు మండలం మినుములూరు పిహెచ్‌సి, గుత్తులపుట్టులో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించి, క్లినిక్‌లో గర్భిణులు, శిశువులు, రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. మాత శిశు మరణాల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీలు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తాగునీరు, అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పాడేరులోని లోచలిపుట్టు జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల-1లో) జిల్లా ఆసుపత్రి వైద్యులు, మినుములూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. 458 మంది విద్యార్థులకు గాను 452 మందికి ఆరోగ్య తనిఖీలు చేయగా, వారిలో 56 మంది రక్తహీనత, చర్మ వ్యాధులు, దగ్గు, తక్కువ బరువు, కంటి చూపు, చెవి, దంత సమస్యలు తదితర వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సికిల్‌సెల్ ఎనీమియా అనుమానిక కేసులుగా నలుగురిని గుర్తించి, వైద్యపరీక్షలకు జిల్లా ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. పాఠశాలలోని డైనింగ్‌హాల్, కిచెన్, సిక్ గది పరిశీలించారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య విద్యను విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడేరు డివిజన్ అన్ని పిహెచ్‌సిల పరిధిలోని పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన వైద్యం అందించడంతోపాటు, మెరుగైన వైద్యం అవసరమైతే పై ఆసుపత్రులకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్.కె.బాబ్జి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మౌనిక, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి జి.సింహాద్రి, హెల్త్ అసిస్టెంట్ బి.ఎలీషారావు, అన్నపూర్ణ, జిల్లా ఆసుపత్రి, మినుములూరు పిహెచ్ సి, 104 వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది,

ఎమ్మెల్సీ ఎన్నికల మీడియా సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ): కలెక్టరేట్‌లోని డిఎస్ఒ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల మీడియా సెంటర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజవర్గానికి సంబంధించి ఆరు జిల్లాల పరిధిలో ఇది పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సలహాలు, వారి సందేహాలను నివృతి చేసేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

ఈనెల 23 వరకు ప్రతిరోజూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తాను ఎమ్మెల్సీ నామినేషన్లను స్వీకరిస్తానన్నారు. ఒక్కొక్క అభ్యర్థి నాలుగు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల లోపల అభ్యర్థుల వాహనాలను అనుమతించబోమని, అభ్యర్థితో పాటు నలుగురు ప్రతిపాదకులు మాత్రమే నామినేషన్ వేసే ప్రదేశానికి రావచ్చన్నారు. పోటీ అభ్యర్థులు తమ ఆస్తులు, తమపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను ఫారం 26లో రూ.100 నాన్ జ్యూడిషియల్ స్టాంప్‌తో తెలియజేయాలన్నారు.

ఈనెల 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ ఉపసంహరణ, మార్చి 13న ఎన్నికలు జరుగుతాయన్నారు. పోలింగ్ నిర్వహణకు గతం కంటే 34 అదనంగా 341 పోలింగ్ బూతులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ముగ్గురు సిబ్బంది ఉంటారన్నారు. మరో 20 శాతం మంది రిజర్వు సిబ్బందితో కలిపి పోలింగ్‌కు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ప్రత్యేకంగా రిసెప్షన్, బ్యాలెట్ పత్రాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏ జిల్లాకు ఆ జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు.

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియానికి పోలింగ్ బాక్సులు

పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను విశాఖ నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియానికి తరలిస్తామన్నారు. ఏదైనా కారణంతో పోలింగ్‌జాప్యంతో సకాలంలో బాక్సులను చేరవేయలేని పరిస్థితుల్లో అక్కడ స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి, మరుసటి రోజున స్వర్ణభారతి స్టేడియానికి చేరవేస్తామన్నారు.

ఆర్ఒ స్థాయి వరకు పోలింగ్ సిబ్బందికి శిక్షణనిచ్చామని, ఇతర సిబ్బందికి కూడా శిక్షణనిస్తామన్నారు. నామినేషన్ల స్వీకరణకు పది రోజుల ముందు వరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి ఓటర్లుగా నమోదు చేశామని, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గంలో 2,87,520 మంది ఓటర్లున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా పోలీసు బందోబస్తు, ఇతర భద్రతా చర్యలను నగర పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ వివరించారు

ఘనంగా పప్పు పండుగ

ప్రజాశక్తి - రంపచోడవరం: మండలంలోని వేములకొండ గ్రామపంచాయితీ పరిధి, సోకులగూడెం గ్రామంలో గ్రామ దేవత జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిని పప్పు పండుగ అని పిలుస్తారని, ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో ఇది జరుగుతుందని గ్రామపెద్ద అన్నవరం తెలిపారు. పప్పు పండుగ నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తీగల చిన్నయ్య, ఎస్.చిన్నయ్య, నేసిక సుబ్బారావు, ఎస్.అన్నవరం, నర్రి పాపారావు, ఎస్.రామారావు, కడబాల రంగయ్య, యువకులు రాజు, చిన్నిబాబు, ఎస్.చంద్రరావు, ఎస్.ప్రకాష్, తీగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పప్పు పండుగలో పాల్గొన్న గిరిజన మహిళలు

పాలనలో వైసిపి పూర్తి వైఫల్యం

టిడిపి విశాఖ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్

ప్రజాశక్తి-కలెక్టరేట్: పాలనలో వైసిపి ప్రభుత్వం విఫలం చెందిందని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ ఆరోపించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాల యంలో మీడియాతో మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇస్తే ఉద్ధరిస్తానంటూ ప్రజలను నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ అందరినీ నట్టేట ముంచారన్నారు. ప్రత్యేక హోదా సాధన, పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్ర మెడలు వంచుతానని ప్రగల్భాలు పలికి, తోక ముడిచారన్నారు.

విశాఖ రైల్వేజోన్‌ను గాలికి వదిలేశారని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తుంటే చేతులు కట్టుకు కూర్చున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కీలకమైన ఇన్ని అంశాలను పక్కనబెట్టి, ఒక్క రాజధాని అమరావతినే అభివృద్ధి చేయడం చేతకాక, మూడు రాజధానులంటూ కాలం గడిపేస్తూ ప్రజలను మళ్లీ మోసపుచ్చుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు చేస్తే తీవ్ర పరిణామాలు

మూర్తి యాదవ్‌పై వైసిపి కార్పొరేటర్ల ఫైర్

ప్రజాశక్తి- కలెక్టరేట్ : జివిఎంసి కమిషనర్, ఇతర అధికారులపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అసత్య ఆరోపణలు మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని వైసిపి కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, చెన్నా జానకిరామ్, కంటిపాము కామేశ్వరి, కెవిఎన్ శశికళ హెచ్చరించారు..

గురువారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఒక్కో వార్డుకు రూ.1.50కోట్లు నిధులను జివిఎంసి సమకూర్చగా, ఒక్కొక్క సచివాలయానికి రూ.20లక్షలను సిఎం జగన్ కేటాయిస్తే, తాను ప్రాతినిధ్యం వహించే 22వ వార్డులో అభివృద్ధి పనులు జరగలేదనిమూర్తి యాదవ్ ఆరోపించడం అతని చేతకానితనానికి నిదర్శనమన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయడం ద్వారా నగరంతోపాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి సిఎం జగన్ ప్రాధాన్యతనిస్తుంటే, విమర్శలు చేయడం, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడడం దుర్మార్గమన్నారు.

ఆర్థిక, డిజిటల్ లావాదేవీలపై అవగాహన

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : యాస్పిరేషన్ జిల్లాగా ఎంపికైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆర్థిక, డిజిటల్ కార్యక్రమాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం తన ఛాంబర్ నుంచి జిల్లాలోని ఎంపిడిఒలు, వెలుగు అధికారులు, బ్యాంకు మేనేజర్లు, ఉద్యోగులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, చాలా గ్రామాల్లో ప్రజలకు బ్యాంకు ఖాతాలు లేనందున వారికి తక్షణమే బ్యాంకు ఖాతాలు ప్రారంభింప చేయాలని ఆదేశించారు. వారిని డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్ది, వారికి జీవనోపాధికి అవసరమైన రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కేంద్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుండి ఆగస్ట్ 15 వరకు ప్రత్యేకంగా నిర్వహించే ఈ కార్యక్రమంపై గ్రామాలలో అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకర్లు ఎంపిడిఒ, వెలుగు అధికారులతో సమన్వయమై పరస్పర సహకారంతో వివిధ పథకాలలో లబ్ధిదారులను నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పిఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్, ముద్ర యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంక్ ఖాతాలు ప్రారంభించి ఆయా పథకాలలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా, బ్యాంకుల వారీగా ముందస్తు షెడ్యూల్ తయారుచేసి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జూమ్ సమావేశంలో జిల్లా లీడ్ మేనేజర్ రవి తేజ పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తీర్ణత పెంపునకు

57 రోజుల కార్యాచరణ ప్రణాళిక

పక్కాగా అమలుకు అధికారులకు ఆదేశం

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి 57 రోజుల కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం ఐటిడిఎ సమావేశ మందిరంలో 11 మండలాల ఎటిడబ్ల్యూఒలు, ఎంఇఒలు, ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశం మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మాదిరి ప్రశ్నాపత్రాలు రూపొందించామని, దీనిపై ప్రతిరోజూ టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా పత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడంతోపాటు వారి స్థాయిని బట్టి తగిన శిక్షణ అందించాలన్నారు. పదో తరగతి సిలబస్ పూర్తి చేయాలన్నారు

ఏప్రిల్ 3వ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు. పాడేరు డివిజన్‌లో 39 పరీక్షా కేంద్రాలలో 153 పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.టెన్త్ పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మన బడి, నాడు నేడు పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.. 31 శాతం మంది ఉపాధ్యాయులు ముఖ హాజరు వేయడం లేదని. దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, డిఇఒ డాక్టర్ పి.రమేష్, ఎటిడబ్ల్యూఒలు ఎల్.రజని, మల్లికార్జునరావు, క్రాంతికుమార్, 11 మండలాల ఎంఇఒలు, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లోనూ మహిళలే పోటీ

అమ్మ పార్టీ జాతీయ కార్యదర్శి ఎన్.సుబ్రమణి

విశాఖ జిల్లా కన్వీనర్‌గా కృష్ణవేణి నియామకం

కృష్ణవేణికి నియామక పత్రం అందిస్తున్న సుబ్రమణి

ప్రజాశక్తి- కలెక్టరేట్ : రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో తమ పార్టీ తరపున మహిళలే పోటీ చేస్తారనిజాతీయ కార్యదర్శి ఎస్. సుబ్రమణి అన్నారు. మహిళ సాధికారతే ముఖ్య ఎజెండా అని, తమ పార్టీ ఏ రాజకీయ పార్టీకి పోటీ కాదని స్పష్టం చేశారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ అత్యాచారాలు, వేధింపులకు గురౌతున్న మహిళలకు న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతోనే అమ్మపార్టీని స్థాపించినట్లు వెల్లడించారు. పాలనలో అధికార విపక్షాల వైఫల్యం నేపథ్యంలో ప్రత్యామ్నాయం కోరుకుంటున్న ప్రజల కోసమే అమ్మ పార్టీ ఆవిర్భవించిందని స్పష్టం చేశారు. అందుకే తమ పార్టీకి విశేష ప్రజాదరణ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ , ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణం, సిపిఎస్ రద్దు, మద్యపాన నిషేధం, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అసంఘటితరంగ కార్మికుల రెగ్యులరైజేషన్, కనీస వేతన అమలు ఇలా అనేక సమస్యల్లో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ప్రజా ఆకాంక్షలను నెరవేర్చడమే తమ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు

ఈ సందర్భంగా అమ్మపార్టీ విశాఖజిల్లా కన్వీనర్‌గా నీలకంఠం కృష్ణవేణిని నియమించామన్నారు. అమ్మపార్టీ పాటల సిడిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి బిఎస్.రాజు, బ్రహ్మకుమారి ఈశ్వరి, బికె.కామేశ్వరిపాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసులో నిందితుని అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సిఐ సత్యనారాయణ

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని గోమంగి పంచాయతీ కుమ్మరవీధిలో ఈనెల 11న హత్య కేసులో నిందితుడు పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జి.మాడుగుల సిఐ సత్యనారాయణ, పెదబయలు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. హత్య తర్వాత సంబంధించి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని గాలించి పట్టుకున్నామని వారు తెలిపారు.